1
నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

ఉత్తమ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

2024-25 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్న ఉత్తమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు 3, 5, 8 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా సంవత్సరానికి జిల్లాకు 41 సీట్లు కేటాయించగా 3వ తరగతిలో 21, 5వ తరగతిలో 10, 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయన్నారు. జూన్ 6లోగా సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలు మించి ఉండరాదన్నారు. జూన్ 12న అభ్యర్థులను లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ - మందమర్రి

మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం తెలిపారు. అందుగులపేట 33/11కెవి లైన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జీఎం ఆఫీసు, యాపల్, కేకే 2, ఊరు మందమర్రి, ఎర్ర గుంటపల్లి, మార్కెట్, దీపక్‌నగర్, శ్రీపతినగర్, దొరల బంగ్లా, పాలచెట్టు, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావుపల్లి, నార్లాపూర్, బొక్కలగుట్టతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేట : మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్, మందమర్రి 33 కేవీ ఫీడర్లలో మరమ్మత్తుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దహెగాం సహకార సంఘంలో గోల్‌మాల్

- రూ.50లక్షలు స్వాహా
- విచారణ జరుపుతున్న ఉన్నతాధికారులు

దహెగాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గోల్‌మాల్ జరిగింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.50 లక్షలను గుట్టుచప్పుడు కాకుండా మింగేశారు. ఈ తంతు మూడేళ్లుగా జరుగుతున్నా ఉన్నతాధికారులకు కూడా తెలియకుండా సంఘం సిబ్బంది జాగ్రత్త పడుతూ వచ్చారు. కాని గతేడాది మార్చిలో జరిగిన ఆడిటింగ్‌తో ఈ గోల్‌మాల్ బహిర్గతమైనా ఇది కూడా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. నెల రోజుల వ్యవధిలో స్వాహా మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పిన సంఘం కార్యదర్శి ఈ మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఇప్పుడు ఉన్నతాధికారులు విచారణాధికారిని నియమించి విచారణ చేపడుతున్నారు.



నవతెలంగాణ-దహెగాం

దహెగాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవినీతికి నిలయంగా మారింది. ఇటీవలే మండలంలోని ఒడ్డుగూడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసం చేస్తూ సంఘం సిబ్బంది రైతులకు పట్టుబడ్డ విషయం తెల్సిందే. తాజాగా ఈ సంఘంలో రూ.50 లక్షల అవినీతి విషయం బట్టబయలైంది. 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించిన ఎరువుల విక్రయాలకు సంబంధించిన డబ్బులను ఇక్కడి సిబ్బంది మార్క్‌ఫెడ్‌కు చెల్లించకుండా ఆ మొత్తాన్ని స్వాహా చేశారు. ప్రతి ఏటా మార్క్‌ఫెడ్ ఈ సంఘానికి ఎరువులను కేటాయిస్తుంది. ఈ ఎరువులను రైతులకు అమ్మి ఆ డబ్బులను మార్క్‌ఫెడ్‌కు చెల్లించాలి. కాని ఇక్కడి సిబ్బంది పూర్తి స్థాయిలో ఆ డబ్బులను మార్క్‌ఫెడ్‌కు చెల్లించకుండా వీటిని స్వాహా చేస్తూ వచ్చారు. ఈ సంఘంలో కార్యదర్శితో పాటు 8 మంది స్టాఫ్ అసిస్టెంట్‌లు, సబ్ స్టాఫ్ ఉన్నారు. వీరు వేతనాల కింద ఈ డబ్బులను తీసుకున్నట్లు చెబుతున్నా ఇది సహకార సంఘం నిబంధనలకు విరుద్ధం. వరి ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల అమ్మకాల ద్వారా వచ్చిన ఇన్సెంటివ్, వసూళ్లలో రెండు శాతం, లాభాలలో 30 శాతం నుండి సిబ్బందికి సంఘం వేతనాలు చెల్లిస్తుంది. ఈ డబ్బులతో పాటు ఎరువుల విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని కూడా ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా సొంతానికి వాడుకున్నారు. గతేడాది జనవరి నుండి జీఓ నెం. 44ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ జీఓ ప్రకారం సిబ్బందికి మార్జిన్ మనీ ఖాతా ద్వారా బ్యాంక్ వేతనాలు చెల్లిస్తుంది. కాని దీనికి ముందు వీరు నిబంధనలను అతిక్రమించి ఎరువుల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకుంటూ వచ్చారు. ఇది 2023 మార్చి నెలలో జరిగిన ఆడిటింగ్‌లో బహిర్గతమైంది.

అప్పుడే సంఘం కార్యదర్శి సిహెచ్ బక్కయ్యకు అధికారులు నోటీసులు జారీ చేయగా, నెల రోజుల్లో ఆ మొత్తాన్ని చెల్లిస్తానని అంగీకరించాడు. కాని రూ.50 లక్షలలో కేవలం రూ.10 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన రూ.40లక్షలు చెల్లించకపోవడంతో ఉన్నతాధికారులు దీనిపై విచారణకు ఆదేశించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణను విచారణాధికారిగా నియమించగా ప్రస్తుతం ఆయన విచారణ జరుపుతున్నారు.

వేతనాల చెల్లింపులో కూడా అక్రమాలు!

మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది వేతనాల చెల్లింపులో కూడా అక్రమాలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతి ఏటా రెండు సీజన్లలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి సీజన్‌లో రెండు నెలల పాటు ఈ కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి. ప్రతి కేంద్రానికి సంఘం ఉద్యోగి ఇన్‌చార్జిగా కొనసాగుతారు. ప్రయివేట్‌గా ఒక అసిస్టెంట్‌ను, ట్యాబ్ ఆపరేటర్‌ను నియమించుకుంటారు. వీరికి రెండు సీజన్‌లకు కలిపి నాలుగు నెలలు జీతాలను చెల్లించాలి. కాని ఏడాది మొత్తం జీతాలు చెల్లించినట్లు రికార్డులలో పొందుపర్చినట్లు సమాచారం. ఏడాది పాటు వారికి జీతాలు చెల్లించారా లేక వారి పేరుతో సిబ్బంది స్వాహా చేసారా అనే విషయంలో కూడా అనుమానాలు రేకెత్తుతున్నాయి.

గోల్‌మాల్ మాట వాస్తవమే : ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి మోహన్

దహెగాం సహకార సంఘంలో నిధుల గోల్‌మాల్ జరిగిన మాట వాస్తవమేనని ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి మోహన్ తెలిపారు. గతేడాది ఇది బహిర్గతమైందని, సంఘం కార్యదర్శి అంగీకరించి ఆ మొత్తాని రికవరీకి అంగీకారం తెలుపడంతో గడువిచ్చినట్లు ఆయన వివరించారు. గడువు ముగిసినా పూర్తి స్థాయిలో రికవరీ కాకపోవడంతో విచారణాధికారిని నియమించి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. కేంద్ర సర్వీసులకు చెందిన వివిధ శాఖల సహాయ విభాగాల అధికారులకు కలెక్టర్ కార్యాలయంలో 'విలేజ్ అటాచ్మెంట్ మాడ్యూల్' అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా సంక్షేమాధికారి కె.చిన్నయ్య, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24 వరకు కేంద్ర సర్వీసులకు చెందిన సహాయ విభాగాల అధికారులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వారికి కేటాయించిన గ్రామాలలో పర్యటించి అమలు చేయబడుతున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. వారికి సహాయంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును, లబ్ధిదారులకు అందుతున్న పథకాలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేయబడుతున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మా భవనాన్ని మాకు ఇచ్చేయాలి

- తహసీల్దార్‌కు మహిళా సమాఖ్యల వినతి



నవతెలంగాణ- తలమడుగు

మండల కేంద్రంలో ఐకేపీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఖాళీ చేసి తమకు అప్పగించాలని వసుంధర మండల సమాఖ్య సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 2019 నుంచి ఐకేపీ భవనంలో కొనసాగుతోందని తెలిపారు. దీంతో తమ సంఘం సమావేశాల నిర్వహణకు భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలోనూ పలుమార్లు ఖాళీ చేయాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఈ సమస్య మీద దృష్టిసారించి తమ భవనం తమకు అప్పగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం అధ్యక్షురాలు ప్రమీల, సభ్యులు కాటిపెల్లి సుశీల, పెందూర్ సోంబాయి, కామెర సజీత, రజియా, ఏపీఎం రాపెల్లి స్వామి తదితరులున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-మందమర్రి

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఎస్‌సిసిడబ్ల్యూయు - ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఆర్‌కెపిసిహెచ్‌పి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిహెచ్‌పిలో పని చేసే 16 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. కాంట్రాక్టర్ బిల్లు పెట్టకుండా, వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టు కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సెల్ పికింగ్ పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ తక్కువ కోడ్ చేయడం వల్ల లాభాలు ఏమి లేవని నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సెల్ పికింగ్ టెండర్ పిలవడంలో సింగరేణి యాజమాన్యం మార్పులు తీసుకురావాలని తెలిపారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేష్, మహేశ్వరరావు, కిరణాల శ్రీనివాస్, బైరి మల్లేష్, కార్తీక్, సంగతి సతీష్, ఎస్ కిష్టయ్య, శంకర్, ఓదెలు, మొగిలి పాల్గొన్నారు.

పల్లె పోరుపై నజర్..!

- గ్రామాల్లో అప్పడే మొదలైన హడావుడి
- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై పార్టీల గురి
- సర్పంచ్ కోసం సన్నద్ధమవుతున్న యువత, ఆశావహులు
- సామాజిక మాధ్యమాల ద్వారా పోటీపై ప్రచారం

లోక్‌సభ ఎన్నికలు ముగిసిపోవడంతో.. ఇక అందరి దృష్టి పల్లె పోరుపై కేంద్రీకృతమవుతోంది. పంచాయతీల్లో కీలకమైన సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. గ్రామీణ స్థాయిలో రాజ్యాంగ బద్ధమైన కీలక పదవి కావడంతో అనేక మంది దీనిపై దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు సైతం పల్లె సమరంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి. ఎన్నికల్లో సత్తాచాటి గ్రామీణ స్థాయిలోనూ పట్టు నిలుపుకోవాలని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులతో పోటీ లేకపోయినా..ఆయా పార్టీల తరపున బరిలో నిలిచేందుకు అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుంటూ పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసేందుకు సమాయత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ చివరి వారంలో..లేదంటే జులైలో ఎన్నికలు ఉంటాయనే విస్తృత ప్రచారంతో పల్లెల్లో సందడి వాతావరణం మొదలైంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ప్రభుత్వం మారింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కూడా పూర్తయినా..ఫలితాలు వెలువడాల్సి ఉంది. జూన్ 4న ఫలితాలు రానుండగా.. వీటి తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించడమే తరువాయిగా మారింది. ఇప్పటికే జూన్ చివరి వారంలో లేదంటే జులైలో నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది. గ్రామీణ స్థాయిలో కీలకమైన ఈ ఎన్నికలపై అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. కీలకమైన సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు అనేక మంది దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలు సైతం గ్రామస్థాయిలో బలపడాలంటే సర్పంచ్‌లుగా పార్టీకి చెందిన వారు ఉండాలనే పట్టుదలతో ఉన్నాయి. దీంతో ఎక్కువ పంచాయతీలను కైవసం చేసుకొని పట్టు సాధించాలనే అభిప్రాయంతో ఉన్నాయి. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో మెజార్టీ తీసుకురావాలని ఆయా పార్టీల ముఖ్యులు గ్రామస్థాయి నాయకులకు సూచించారు. ఎవరు ఏయే గ్రామాల్లో పార్టీకి మెజార్టీ ఓట్లు తీసుకొస్తారో..స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందని సూచించారు. దీంతో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీలకు చెందిన గ్రామస్థాయి కీలక నాయకులు మెజార్టీ ఓట్లు పడేలా క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎక్కువ పంచాయతీలను గెలుచుకోవాలని భావిస్తుండగా.. బీజేపీ సైతం ఇదే భావనతో ఉంది. ఇక ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ సైతం పంచాయతీ పోరులో తలపడి పట్టు నిలుపుకోవాలని భావిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.

యువత..ఆశావహుల్లో ఆసక్తి..!

గ్రామీణ స్థాయిలో సర్పంచ్ పదవి అత్యంత కీలకమైనది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎవరు గ్రామానికి వచ్చినా ముందుగా సర్పంచ్‌కు సమాచారం ఉండాల్సిందే. ఆయా సభల్లోనూ సర్పంచ్ అధ్యక్షత వహించాల్సి ఉంటుంది. ఇక కేంద్రం, రాష్ట్ర నుంచి వచ్చే వివిధ రకాల నిధులతో ఊరిని అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉంటుంది. దీంతో ప్రస్తుతం యువత ఎక్కువ మంది ఈ పదవిని దక్కించుకునేందుకు ఆరాటపడుతున్నారు. వీరితో పాటు ఆయా పార్టీల్లో కీలక పాత్ర పోషిస్తున్న వారు సైతం ఈ పదవి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల స్థాయిలో ఉండే వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఆతృతను తెలియజేస్తున్నారు. ప్రత్యేకంగా గ్రూపులు తయారుచేసి వారికి అనుకూలంగా ఉండేవారిని అందులో చేర్చుతున్నారు. కొన్ని చోట్ల ఇటీవల పదవి ముగిసిన సర్పంచ్‌లకు..కొత్తగా బరిలో నిలవాలనే వారికి మధ్య వార్ కొనసాగుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. యువతను ఆకట్టుకునేందుకు ఇప్పట్నుంచే వివిధ రకాల ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలను నిత్యం ప్రసన్నం చేసుకుంటూ బరిలో ఉంటాననే ఆసక్తిని తెలియజేస్తున్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టాలని భావిస్తుండటంతో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సర్పంచ్ పదవి కోసం పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారు సొంతంగా గ్రూపులను తయారుచేసుకుంటున్నారు. రిజర్వేషన్లు మారితే ఎవరు పోటీ చేయాలి..మారకపోతే ఎవరు బరిలో ఉండాలనే నిర్ణయానికి కూడా రావడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.



జిల్లా	పంచాయతీలు	వార్డులు
ఆదిలాబాద్	468	3840
మంచిర్యాల	311	2730
నిర్మల్	396	3336
కుమురంభీం	335	2874

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్, పోలీస్, పంచాయతీ, రెవెన్యూ, తపాలా, రవాణా, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులతో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. పరీక్షలను ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు ఉదయం 9 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, ప్రశ్నాపత్రాల తరలింపు పోలీసు అధికారుల బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, నిరంతర ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐ అశోక్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శైలజ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, విద్య, తపాలా, బిఎస్ఎన్ఎల్, ఆర్‌టిసి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

2024-25సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 3వ, 5వ, 8వ తరగతిలో ప్రవేశం కొరకు తేదీ 21 నుంచి జూన్ 06 వరకు దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన సంక్షేమం ఉప సంచాలకులు దిలీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతిలో 50 సీట్లు, 5వ తరగతిలో 25 సీట్లు, 8వ తరగతిలో 25 సీట్లు తరగతి వారీగా సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని, దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు తమ వెంట కుల ధృవీకరణ పత్రం, ఆదాయ పత్రం, బోనాఫైడ్, ఆధార్ కార్డులు తీసుకొని జూన్12 బుధవారం ఉదయం 10 గంటల నుంచి పీఎంఆర్సీ బిల్డింగ్ కేబీ కాంప్లెక్స్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందని, దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల తల్లి తండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలు మించకూడదని అన్నారు.

దివంగత కేకే దీక్షిత్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్



రాష్ట్రీయ వికలాంగుల పార్టీ వ్యవస్థాపకుడు దివంగత కేకే దీక్షిత్ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు వికలాంగులందరికీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం అధ్యక్షులు ఇసాక్ అలీ మాట్లాడారు. వికలాంగులు ప్రతి రంగంలో ముందుండాలన్నారు. వికలాంగులను రాజకీయాల్లోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలో తమ సంఘం పూర్తిగా వికలాంగుల సమస్యలపై పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, నిషిత, శ్రీనివాస్, శ్రీను, లక్ష్మణ్, వీరయ్య పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



నవతెలంగాణ-నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివిధ అంశాలపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, డీఎస్ఓ నందిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

- జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి



నవతెలంగాణ-ఉట్నూర్

మూఢ నమ్మకాలను విడనాడి, శాస్త్రీయత వైపు అడుగులేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేబీ కాంప్లెక్స్ పీఎమ్మార్సీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిత్య జీవితంలో మూఢ నమ్మకాలను విడి శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించు కోవడం చాలా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉట్నూర్ మండల ప్రధాన కార్యదర్శి బాదు, స్పోర్ట్స్ కోచ్ సునంద, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుజారి పడి బీహార్ కూలీ మృతి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆదర్శ భవనంపై నుంచి కిందకు దిగే క్రమంలో కాలుజారి పడి బీహార్ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని మునిపెల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపెల్లి గ్రామంలో బీహార్ నుంచి వచ్చిన లాల సహాని(28) హామాలి పని చేస్తుంటాడు. ఆదివారం గ్రామంలోని ఆదర్శ భవనంపైన పడుకొని అర్ధరాత్రి సుమారు 2:30 గంటలకు బహిర్భుమి కి వెళ్లడానికి కిందికి దిగే క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. తలకు గాయమై, ముక్కులో నుంచి రక్తం వచ్చి మరణించినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు అయిన వకీల్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల సహాకారంతో మృతదేహాన్ని బీహార్‌కు పంపించారు.

యువకుడి అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని హార్యాపూర్‌కు చెందిన డాకూరే నారాయణ్(21) యువకుడు గత ఐదు రోజుల నుంచి ఆచూకీ లేక పోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సదరు యువకుడు ఈ నెల 15న డిగ్రీ పరీక్షలు రాయడానికి వెళ్లాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆరోజు నుంచి ఆతని స్నేహితులు, బంధువుల ఇంట్లో గాలించిన ఇప్పటి వరకు ఆతని ఆచూకీ దొరకలేదన్నారు. సోమవారం ఆతని తండ్రి డాకూరే మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

21 నుంచి జొన్న పంట కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్థానిక మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోళ్లను తేదీ 21 నుంచి 25వ తేదీ వరకు బంద్ నిర్వహిస్తున్నట్టు సొసైటీ సీఈఓ గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు భారీ వర్షాలు ఉండటం వలన కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులు గమనించి మంగళవారం నుంచి జొన్న పంట మార్కెట్‌కు ఎవ్వరూ తీసుకు రావద్దని కోరారు. రైతులు ఎవరైనా తీసుకువచ్చిన లోపలకి ఎవరికి ఎంట్రీ ఉండదని సూచించారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

జనాభా ప్రాతిపదికన ఏఎన్ఎంలను నియమించి

పనిభారాన్ని తగ్గించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- డీఎంహెచ్ఓకు సీఐటీయూ వినతి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఎఎన్ఎంలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కారం చేయాలని, అదనపు జనాభా వలన పనిభారం పెరుగుతోందని జనాభా ప్రాతిపదికన ఏఎన్ఎంలను నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.నరేందర్ రాథోడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మొత్తం 12 మంది ఏఎన్ఎంలు పనిచేస్తున్నారన్నారు. ఒక్కొక్క అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఏఎన్ఎంకు దాదాపుగా 15 వేల నుంచి 20 వేల వరకు జనాభా ఉందన్నారు. గతంలో పీపీ యూనిట్ పరిధిలో ఉన్న జనాభాను, అక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎంలను అర్బన్ హెల్త్ సెంటర్‌లో కలపాలని జీఓ ఇవ్వటం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో అర్బన్ హెల్త్ సెంటర్లకు పీపీ యూనిట్ జనాభాను యూపీహెచ్‌సీలలో కలిపి అక్కడ ఏఎన్ఎంలను యధావిధిగా పీపీ యూనిట్‌లోనే కొనసాగుతున్నారని తద్వారా యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలను అదనపు జనాభా భారం పెరిగిందన్నారు. వేరే జిల్లాలో యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలకు 5 వేలకు మించి జనాభా లేదన్నారు. ఈ మధ్య కాలంలో పీపీ యూనిట్‌ని రద్దు చేశారని, అక్కడ ఉన్న ఏఎన్ఎం లను యూపీహెచ్‌సీలకు ఇవ్వాలన్నారు. ప్రతి యూపీహెచ్‌సీలో అదనపు ఏఎన్ఎంలను నియమించి, ఏఎన్ఎంలపై పెరిగిన పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, ఏఎన్ఎంలు పుష్పలత, తులసి అన్నపూర్ణ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏఓ



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏఓ, ఏఈఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి గణేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాజుర గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ ఉమేష్‌తో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలని డీసీఎంఎస్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. వర్షంలో ధాన్యం తడవకుండా ముందస్తుగా టార్పలిన్ సిద్ధంగా ఉంచుకొని ధాన్యం తడవకుండా చూసుకోవాలని రైతులకు తెలిపారు. ధాన్యం తరలించేందుకు కేంద్రానికి అవసరమైన లారీలను సకాలంలో పంపిస్తామని పేర్కొన్నారు. రైతులకు వేసవిలో లోతు దుక్కులపై అవగాహన కల్పించారు. రైతులు వేసవి కాలంలో నేలను లోతు దుక్కులను దున్నుకోవాలని ఏఓ తెలిపారు. ఎంత లోతుగా దుక్కి దున్నుకోవాలనేది మనం వేయబోయే పంటను బట్టి కూడా ఉంటుందని చెప్పారు. పత్తి మొక్కజొన్న, వేరుశనగ, పసుపు మొదలగు పంటల వేర్లు మధ్యరకంగా 15 నుంచి 20సెంటి మీటర్ల లోతు సరిపోతుందని తెలిపారు. భూమిని దున్నే ముందు నేలలో పశువుల ఎరువుగాని, కంపోస్టుగాని, చెరువులోని నల్లమట్టిని గాని, వెదజల్లడం వలన నేల సారవంతమౌతుందని వేసవిలో లోతు దుక్కులు దున్నడం ద్వారా కలుపు మొక్కలు వాటి విత్తనాలు నశింపబడతాయని రైతులకు సూచించారు.

రెండు రోజుల్లో జీలుగ విత్తనాలు..

జీలుగా విత్తనాలు రెండు రోజుల తర్వాత అందుబాటులో ఉంటాయని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, అదార్ కార్డ్ జీరాక్స్ తీసుకొని సంబధిత వ్యవసాయ శాఖ కార్యాలయానికి రావాలని తెలిపారు.

చిన్నారులను ఉపాధిహామీ పనులకు తీసుకురావొద్దు



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి అరుణ్

నవతెలంగాణ-లోకేశ్వరం

చిన్నారులను ఉపాధి హామీ పనులకు తీసుకురావద్దని పంచాయతీ కార్యదర్శి అరుణ్ అన్నారు. సోమవారం మండలంలోని హవర్గా గ్రామంలోని చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం పంచాయతీ కార్యదర్శి అరుణ్ పరిశీలించారు. జాబ్ కార్డులో పేర్లు ఉన్న వారే ఉపాధి పనికి రావాలని చిన్నపిల్లలను పనులకు తీసుకు రావద్దన్నారు. చిన్నారులను పనికి తీసుకువచ్చిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత...

రాజురా గ్రామంలో ఉపాధిహామి కూలీలకు సోమవారం పంచాయతీ కార్యదర్శి మహేశ్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భంగా కూలీలకు వడ దెబ్బ బారిన పడకుండా అధికారుల ఆదేశానుసారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్రీలత, మమత, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి తాత్కాలికంగా కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వాతావరణ శాఖా సూచనల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాల కురిసే అవకాశం ఉన్నందున మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మద్దతు ధరతో చేపడుతున్న జొన్నల కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్టు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 25వ తేది వరకు నాలుగు రోజుల పాటు కొనుగోలు ప్రక్రియ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. తిరిగి 26 నుంచి యధావిధిగా కొనుగోళ్ల చేపడుతామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా రైతులు గమనించి మార్కెట్ యార్డ్‌కు తమ జొన్నలు తీసుకొని రావద్దని పేర్కొన్నారు. తమ జొన్న పంటను కూడా వర్షాలలో తడువకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంగళవారం ఎక్స్‌ప్రెస్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్‌లోని ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పరిదిలోని బెల్లూరి, చాందా(టి) పరిశ్రమలు, షాపులలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఫీడర్ పరిదిలోని వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు కొత్త రోడ్డు నిర్మించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలించిన రహదారులు మరమ్మతులు చేయడంలో వైఫల్యం చెందిందని ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు కొత్త రోడ్డును వేయాలని గిరిజన ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సుమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఎన్నిక సమయంలో విస్తృతంగా పర్యటించారని తెలిపారు. తరచు ప్రమాదాలు సంభవిస్తున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కూడా సంబంధిత అధికారులు రోడ్డును పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, రోడ్లకు మరమ్మతులు చెప్పట్టాలని డిమాండ్ చేశారు. లేని యెడల గిరిజన ఆదివాసీ సంఘ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుద్దికొండ గ్రామంలో ఉన్న నర్సరీని ఎంపీడీఓ రాజ్‌వీర్ పరిశీలించారు. వేసవికాలం సందర్భంగా మొక్కలు ఎండిపోకుండా నీటిని సక్రమంగా పట్టాలని, మొక్కలకు ఎండ తగలనీయకుండా గ్రీన్ నెట్‌లను కట్టాలని అన్నారు. కలుపు మొక్కలు తీసివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంత్ ఉన్నారు.

ఎస్బీఐ పేరిట సైబర్ నేరగాళ్ల మెసేజ్‌లు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



సైబర్ నేరగాళ్లు ఇక కొత్త పంథాను ఎంచుకున్నారు. ఎస్బీఐ రివార్డ్స్ పేరిట ఖాతాదారులకు మెసేజ్‌లు పంపుతున్నారు. మీ ఖాతాలో నెట్ బ్యాంకింగ్ ద్వారా రివార్డు వచ్చిందని, ఈ రోజే ఆఖరి అవకాశమంటూ మెసేజ్‌లు పంపుతూ ఈ కింది లింకును ఓపెన్ చేసి చూడాలని ఫేక్ మెసేజ్‌లు పంపుతున్నారు. ఇది నిజమే అనుకొని గతంలో అనేక మంది ఈ యాప్‌ను ఓపెన్ చేయడంతో వారి ఖాతాల నుంచి డబ్బులు మాయమయ్యాయి. తరువాత వినియోగదారులు మోసపోయామని పోలీసులకు ఫిర్యాదులు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా ఇలాంటి సైబర్ నేరగాళ్ల మెసేజ్‌లు వాట్సాప్‌లో పంపుతున్నారు. ఇలాంటి మెసేజ్‌లు నమ్మకూడదని, ఇటువంటి లింకులను ఓపెన్ చేయకూడదని పోలీసులు పేర్కొంటున్నారు. ఇటువంటి మెసేజ్‌లతో ముందు జాగ్రత్త వహించి మోస పోకూడదని పోలీసు శాఖ తరపున ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇప్పటికైనా వినియోగదారులు ఎస్బీఐ పేరిట వస్తున్న మెసేజ్‌లపై తస్మాత్ జాగ్రత్త.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని కూర గ్రామంలోని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2006-07 సంవత్సర విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా తమ పూర్వ ఉపాధ్యాయులని ఆహ్వానించారు. వీరికి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహలకులు ఏనుగు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఒకే వేదికపై అందరిని కలవడంతో మధుర జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఆరోజు ఉపాధ్యాయులు చెప్పిన విద్యతో ఈరోజు ఈ ఉన్నత స్థాయిలో ఉన్నామని గుర్తుచేశారు.

ఆర్మీ కుటుంబానికి రూ.3లక్షల చెక్కు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా మంజూరైన రూ.3లక్షల చెక్కును సోలంకి పూజకు కలెక్టర్ రాజర్షిషా అందజేశారు. సోమవారం తన ఛాంబర్‌లో సోలంకి పూజకి రూ.3లక్షల చెక్కును అందజేశారు. సోలంకి పూజ భర్త సోలంకి సుధాకర్ ఆర్మీలో పనిచేస్తూ సర్వీసులో ఉండగా గత ఏడాది 2023 ఆగస్టు 6న మరణించారు. దీంతో సెంట్రల్, స్టేట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన కుటుంబ సభ్యుల వివరాలు, యోగక్షేమాలు తెలుసుకొని చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మాజీ సైనిక సంఘ అధ్యక్షులు శంకర్‌దాస్, దేవన్న ఆర్ఐ అశోక్, తిరుపతిరెడ్డి, వామన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన సంఘటన సోమవారం మావల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెంకు చెందిన నర్సయ్య, ఆయన భార్య రాధ ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వైపు వస్తుండగా వాహనం ముందు చక్రం రాడ్ విడిపోయి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకొని 108 సిబ్బంది కిషన్, ముజఫర్ వారికి ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.

చైల్డ్ లైన్ సెంటర్‌కు చిన్నారుల అప్పగింత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పంజాబ్‌చౌక్ ఇద్దరు చిన్నారులు సోమవారం తప్పిపోయారు. వాళ్ళు ఏడుస్తూ ఉండగా గమనించిన స్థానికులు కానిస్టేబుల్ దేవిదాస్‌కు సమాచారం ఇవ్వగా ఆయన అక్కడ చేరుకొని వివరాలు ఆరా తీశారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామమని, తమ పేర్లు ఆత్రం మీనాక్షి, కార్తీక్ అని తెలిపారు. తమను అక్క వదిలేసి వెళ్లిందని పేర్కొన్నారు. బ్యాంక్ కు వెళ్ళొస్తానని చెప్పి రాలేదని చిన్నారులు వాపోయారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్‌కు సమాచారం అందించి పిల్లలను బాల రక్షక్ మొబైల్ సిబ్బందికి అప్పగించారు.

ట్రస్మా నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ ప్రయివేటు పాఠశాలల సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా దేవ భూషణం, గౌరవ అధ్యక్షులుగా పెద్దపల్లి కిషన్ రావు, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి చారి, ట్రెజరర్‌గా రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజీవ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జితేష్ సితాని, స్పోర్ట్స్ పర్సన్‌గా నరేందర్, లీగల్ అడ్వైజర్‌గా రాపర్తి రవీందర్, చీఫ్ అడ్వైజర్‌గా గోపాల్, మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తిరుపతి, రాజయ్య, రమన్ తదితరులు ఎంపికయ్యారు. ఎంపికైన కార్యవర్గాన్ని సన్మానించి అభినందనలు తెలిపారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఖైరగూడ ఓసీపీలో నూతన ఫిట్ కమిటీని యజమాన్యానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ కార్మికుల తరపున వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. అనంతరం ఖైరగూడ ఫిట్ కమిటీ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ టెంపుల్ కమిటీ సభ్యులు, ఫిట్ సెక్రెటరీ మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మాల ఓదెల, రిలే ఇన్‌చార్జిలు రాయిని రాజయ్య, తుంగ వెంకటేశం, పుట్ట అంజయ్య, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిలు అన్నం రాజకుమార్, అల్లాడి కోటిలను మేనేజ్మెంట్‌కు ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు భయ్యా మొగిలి ఖైరగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, గని మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వరరావుకు పరిచయం చేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు జగ్గయ్య శేషు, జూపాక రాజేష్, కె కిరణ్ బాబు, మిసా చంద్రశేఖర్, డి దివాకర్ పాల్గొన్నారు.

డి-కేటగిరి ఈవీఎంల భద్రత దిశగా చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డి-కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా వేర్ హౌస్ నుండి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో గల సీ, డి కేటగిరి స్ట్రాంగ్ రూమ్‌కు డి కేటగిరి ఈవీఎంలను తరలించి భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వేర్ హౌస్ నుండి డి-కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలని తరలించి భద్రపరచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎన్నికల పర్యవేక్షకులు మధుకర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జితేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో సోమవారం జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి యంగ్ హీరోకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు కుంటాల నారాయణ, బండి మల్లికార్జున గౌడ్, మోతిరామ్, తిరుపతి, వై.రవి, పండు, దామోదర్, నరేష్, శంకర్ పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకుల ప్రిన్సిపల్ అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ ఎస్టీ విద్యార్థినులు ఈనెల 23న ఉట్నూర్‌లోని కెబి కాంప్లెక్స్ గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆరోగ్య సేవలు మెరుగు పర్చాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్స్‌లకు ఆరోగ్య సేవలను మెరుగు పర్చాలని రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, కలికోట రమణయ్య, యెల్లాగౌడ్, మార్త ఉపేందర్, నాగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్న నిర్వాహకుల నిర్లక్ష్యంతో చాలా అవస్థలు పడుతున్నారని, నడవలేని స్థితిలో ఉన్న వయోవృద్ధుల, దివ్యాంగులకు సంచార వైద్య వాహనాల ద్వారా ఆరోగ్య సేవలు అందించే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులున్నా పట్టించుకొనే నాధుడు లేడన్నారు. వయోధికులకు మెరుగైన సేవలందించాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్ నగర్‌లో ఐదు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న ముద్రకోల్ శ్రీనివాస్(32) మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య సమ్మక్క, ఇద్దరు పిల్లలున్నారు. మహారాష్ట్రలోని ఆళ్లపెల్లి నుండి జిల్లా కేంద్రానికి వచ్చి మేస్త్రి పని చేసుకుంటున్నాడు. కొంతకాలం నుండి తాగుడుకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి తాగి ఇంటికి వచ్చి భార్య పిల్లలతో గొడవకు దిగాడు. వారిని ఇంటి బయట ఉంచి లోపలికి వెళ్లి తలుపు గెడ పెట్టుకున్నాడు. తలుపు తీయమని అడిగినప్పటికీ తీయకపోవడంతో భార్య పిల్లలు బయటనే పడుకున్నారు. ఉదయం లేచిన తర్వాత కూడా అదే విధంగా ఉండడంతో వెంటిలేటర్ నుండి లోపల ఏం జరుగుతుందని చూడడంతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడం కనిపించింది. సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. మృతుడి తమ్ముడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బౌద్ధపౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-వాంకిడి

బౌద్ధపౌర్ణిమ వేడుకల ఘనంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ కోరారు. జిల్లాలోని బౌద్ధ బంధవులకు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, భారతీయ బౌద్ధ మహా సభ నాయకులకు, సిద్దార్థ యువజన సంఘం సభ్యులు, రామాబాయి మహిళ మండలి సభ్యులు 2586వ బౌద్ధ పౌర్ణిమ వేడుకల ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ కూడలిలను పంచశీల, నీలి జెండాలతో ముస్తాబు చేయాలని సూచించారు. సాయంత్రం క్యాండిల్ శాంతి ర్యాలీ నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు బౌద్ధ పౌర్ణిమను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- మండలంలో చేపట్టిన రూ.6.5 కోట్ల పనులపై నివేదిక
- నేటి నుంచి మండలంలోని 31 జీపీల్లో సోషల్ ఆడిట్

నవతెలంగాణ-కెరమెరి

గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు స్థానికంగానే పనులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేస్తున్నది. ఇందులో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి వ్యక్తికి ఏడాదిలో వంద రోజుల పాటు పని కల్పిస్తారు. చేపట్టే పనులు, కూలీల చెల్లింపులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం ఉపాధి పనులపై ప్రతి ఏడాది సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎన్ని పనులు చేపట్టారో..? వాటిని క్షేత్రస్థాయిలో తనిఖీ బృందాలు పరిశీలిస్తాయి. అనంతరం మండల స్థాయిలో ప్రజా వేదిక సభ నిర్వహించి సామాజిక తనిఖీపై గ్రామాల వారీగా నివేదికలను ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపిస్తారు. ఇందులో భాగంగా మండలంలో మంగళవారం నుంచి తనిఖీ బృందాల క్షేత్రస్థాయి పనులపై తనిఖీలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణారావు తనిఖీ బృందం సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

31 గ్రామపంచాయతీల్లో సోషల్ ఆడిట్

ఈ నెల 31 వరకు గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టిన పనులను పరిశీలిస్తారు. తనిఖీ సిబ్బంది ఇప్పటికే మండల కార్యాలయంలో ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఒక ఎస్ఆర్‌పీ, 13 మంది డీఆర్‌పీలు, వీఎస్ఏలు 50 మంది, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో సందర్శించి పనులను పరిశీలించనున్నారు. ఈ ఏడాదిలో రూ.6.5 కోట్ల పనులపై తనిఖీ నిర్వహించనున్నారు. పనులు, ఖర్చులు, చెల్లింపులు తదితర వాటిపై మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో సభలు నిర్వహించి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు.

రూ.6.5 కోట్ల పనులపై తనిఖీ

మండలంలో 1 మార్చి 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ.6.5 కోట్లతో ఉపాధి హామీ పనులు జరిగాయి. పొలాల్లో భూమి లెవలింగ్, నీటి కుంటలు, కుంటల్లో పూడిక తీత, కంపోస్టు షెడ్‌ల నిర్మాణంతో పాటు కాలువల మరమ్మతులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, మొక్కలు నాటడం, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం వంటి అనేక పనులను చేపట్టారు. ఈ పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను తీసుకుని సామాజిక తనిఖీ సిబ్బంది పని ప్రదేశానికి వెళ్లి వాస్తవంగా పని జరిగిందా..? కొలతల ప్రకారం ఎంబీలో రికార్డు చేశారా..? మస్టర్‌లో నమోదు చేసిన కూలీలకు చెల్లింపులు నిబంధనల ప్రకారం చేశారా..? వంటి అంశాలను సిబ్బంది పరిశీలిస్తారు. చేసిన పనిలో ఏమాత్రం తేడా ఉన్నా మండల స్థాయిలో నిర్వహించే ప్రజా వేదికలో చదివి పనుల వారీగా ఎంత మేరకు అవినీతి జరిగిందో సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేయడానికి నిర్ణయిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావ్



పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని, ప్రయాణంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత చర్యల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్ జాబితాలో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో విచారణ జరిపి బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పశువులు రోడ్లపైకి రాకుండా సంబంధిత పశుయజమానులకు అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ వినియోగం, కార్లు, ఇతర వాహనాలలో సీట్ బెల్ట్ ధరించడం, రోడ్డు భద్రత నియమాలను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు, మూలమలుపులు, ప్రమాద ప్రాంతాలు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలు, వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణమే వైద్య సహాయం అందించేందుకు 108 అంబులెన్స్ వినియోగంపై ప్రజలకు వివరించాలని, కేజ్ వీల్స్‌తో రహదారులపై వాహనాలు నడవకుండా చూడాలన్నారు. విద్యాసంస్థలలో వయస్సు పరిమితి ఉంచకుండా వాహనాలు నడపరాదని, వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని విద్యార్థులకు తెలియజేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతినెల అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర రవాణా వాహనాలు నడిపే సమయంలో భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలో 2021లో 68, 2022లో 57, 2023లో 70 ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాలలో 450 మంది వరకు మృతి చెందారని, జిల్లాలో 45 బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. జాతీయ రహదారుల శాఖ అధికారుల సమన్వయంతో ఆయా ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి, పాలిసెట్, ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో 1938మంది, ద్వితీయ సంవత్సరంలో 1051 విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 11 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు 1200 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇంటర్ మీడియట్ ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని, ఎస్ఎస్‌సీ పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:30 వరకు జరుగుతాయన్నారు. ఈ నెల 24న జరగనున్న పాలిసెట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు. పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో సమయానుకూలంగా బస్సులు నడిపించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురికాకుండా అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్, కాగజ్‌నగర్ ఆర్డీఓ కాసబోయిన సురేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్‌లతో కలిసి పాఠశాలల అభివృద్ధి పనులు, ఏకరూప దుస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో తరగతులు ప్రారంభమయ్యేలోగా పాఠశాలలలో చేపట్టిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మత్తు పనులను గ్రామ సమైక్య సంఘాల సభ్యుల సహకారంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ పనులతో పాటు తరగతి గదుల మరమ్మత్తులు, బాలికలకు ప్రత్యేకంగా మూత్రశాలలు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా దుస్తుల తయారీకు 78 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో చేపట్టిన పనులలో కూలీల హాజరు శాతాన్ని పెంపొందించి పనులు త్వరగా చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఐకెపీ, ఉపాధి హామీ ఏపీఎంలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ అధికారి మందపెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు 33కేవీ కెరమెరి లైనులో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ అవలబుల్ పాఠశాలల పథకంలో జిల్లాకు 78 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్)లో 38, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 40 సీట్లు కేటాయించారన్నారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 4వ తరగతి ఉత్తీర్ణులై దరఖాస్తుతో గత సంవత్సరం మార్కుల జాబితా, బోనఫైడ్ జతపరచాలని సూచించారు. జూన్ 7న సాయంత్రం 5 గంటలలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

చింతగూడ, కోయవాగు గ్రామపంచాయతీ నిధులను కార్యదర్శి సుస్మిత దుర్వినియోగం చేసిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మల్టీపర్పస్ లేబర్లకు 2 నెలల జీతం పెడింగ్ పెట్టి పీఎఫ్ఎంఎస్ నిధుల నుండి తన భర్త పుట్ట నవీన్ పేరు మీద రూ.29,555, రూ. 19,630 తీసుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇతర ఖర్చుల పేరిట రూ.2,17,593 తీశారన్నారు. మొత్తం రూ. 2,66,778 వాడుకుందన్నారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ చింతపురి లక్ష్మి, ఉప సర్పంచ్ ఆదె రాజు, ఎల్ శ్యాంరావు, సీహెచ్ మల్లేష్, వడాయి అశోక్ ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీ

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లను సోమవారం జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య ఆకస్మిక తనిఖీలు చేశారు. అంగన్‌వాడీలు సమయ పాలన పాటించడం లేదని, పిల్లలు, గర్భిణీలకు ప్రతి రోజు ఇవ్వాల్సిన పోషక ఆహారం అందించక పోవడం పట్ల కొన్ని రోజులుగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు అధికారి చిన్నయ్య తెలిపారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించినంతరం సెంటర్‌లను సందర్శించి టీచర్‌ల విధివిధానాలపై తల్లిదండ్రులతో మాట్లాడి ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహించిన మంచిర్యాల పట్టణంలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్, బెల్లంపల్లికి చెందిన టీచర్‌లకు మెమోలు అందించినట్లు తెలిపారు.

మహిళా సాధికారత, పథకాలపై అవగాహన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహిళా సాధికారత, పలు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సును సోమవారం మహిళా సమైక్య భవనంలో నిర్వహించారు. మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్సిల్ లిటీరసీ లిప్సిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భేటీ బచావో, భేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ ఇతర హెల్ప్‌లైన్ల నంబర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి వీఓ లీడర్స్, పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సాధికారత సాధ్యం



నవతెలంగాణ-మందమర్రి

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని స్టేట్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (ఎస్ఐఈటీ) హైదరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ రవికాంత్ రావు అన్నారు. సోమవారం వయోజన విద్యా శాఖ, లయన్స్ క్లబ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో నడుస్తున్న వయోజన విద్యా, కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మహిళలు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని, తద్వారా అనువైన రంగంలో రాణించవచ్చన్నారు. మహిళలు విద్యను ఆశ్రద్ధ చేయకూడదని, ఓపెన్ డిగ్రీ, ఇంటర్ చదువుకునేందుకు వయసు అడ్డం కాదన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, వయోజన విద్యా శాఖ సంచాలకులు అజ్మీరా పురుషోత్తం నాయక్, వయోజన విద్యా ఎస్ఓ ఎస్ఎన్ మూర్తి, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి అధ్యక్షురాలు బండ శాంకరీ, డీఆర్పీలు ఆర్ ప్రకాశం, సువర్ణ, సుందిళ్ల రమేష్, శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, కన్వీనర్ ఉప్పులేటి నరేష్, ట్రైనర్ ఉప్పులేటి శారద పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీఓ కిషన్



నవతెలంగాణ-జన్నారం

ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ కిషన్ కోరారు. సోమవారం మండలంలోని చింతగూడ గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజువారి వేతనం రూ.300 వచ్చే విధంగా చూడాలన్నారు. పనుల ప్రాంతంలో నీడను ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మండల అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పర్యవేక్షణ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మారుమూల గిరిజన గ్రామ పాఠశాలలు ఎంపీపీఎస్ బెజ్జాల, నరసాపూర్ ఎస్‌వీకే 5 పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ పరిశీలించారు. బెజ్జాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 90 శాతం పనులు పూర్తి చేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డం సంపత్, చైర్మన్ మడావి బద్రుబాయిలను అభినందించారు. అదేవిధంగా ఎంపీపీఎస్ నర్సాపూర్ పనులు ఈనెల 31లోపు పూర్తి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లకు సూచించారు.

అందుబాటులోకి రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

వానకాలం సీజన్‌కు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము విత్తనాలు జెండా వెంకటాపూర్, లక్షెట్టిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విత్తనాలు మంగళవారం నుండి అందుబాటులో ఉంటాయని, 40 కిలోల బ్యాగ్ ధర 1448, జనుము విత్తన బ్యాగులను రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగు చొప్పున సరఫరా చేయడం జరుగుతుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని లక్షెట్టిపేట, దౌడిపెల్లి, జెండా వేంకటాపూర్, పోతేపల్లి, వెంకట్రావుపేట్ రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి టోకెన్ తీసుకొని జెండా వెంకటాపూర్, లక్షెట్టిపెట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం నుండి విత్తనాలు తీసుకోవాలన్నారు.

చిరుతపులి చర్మంతో పట్టుబడిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

- వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్

చిరుతపులి చరర్మాన్ని స్మగ్లింగ్ చేస్తున్న సమయంలో అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు పట్టుకున్నారు. కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రాపన్‌పల్లి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు చిరుతపులి చర్మంతో పట్టుబడినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. చత్తీస్‌ఘడ్‌కు చెందిన నిందితులు భీజాపూర్ జిల్లా భూపాలపట్నం బారెగూడ వర్ధల్లి నివాసులైన దుర్గం పవన్, బాబర్‌ఖాన్ రెండు సంవత్సరాల క్రితం బీజాపూర్ జిల్లా బోడగుట్ట అటవీ ప్రాంతంలో చిరుత పులిని చంపినట్లు తెలిపారు. చిరుతపులి చర్మం విక్రయించేందుకు మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తున్న క్రమంలో రాపన్‌పల్లి వంతెన వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుండి చిరుతపులి చర్మంతో పాటు మోటార్ రెండు సైకిళ్లు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా ప్రధాన నిందితుడైన దుర్గం పవన్ రెండు సంవత్సరాల క్రితం చంపిన చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు బాబర్‌ఖాన్‌ను సంప్రదించగా ఇద్దరు నిందితులు చిరుత చర్మాన్ని మంచిర్యాలకు తరలిస్తు పట్టుబడ్డారని తెలిపారు. ఈ మేరకు కోటపల్లి ఎఫ్ఆర్ఓ రవి నేతృత్వంలో అటవీ అధికారులు పట్టుబడినది చిరుతపులి చర్మమని ధృవీకరించనట్లు వెల్లడించారు.



పట్టుబడిన చిరుత చర్మం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చికిత్స పొందుతూ ఉపాధి హామీ కూలీ మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి కూలీలను తరలిస్తున్న వాహనం బోల్తా పడిన ఘటనలో గాయపడిన బంగారు మల్లవ్వ(48) అనే మహిళ సోమవారం కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ భూమేష్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవ్వ శుక్రవారం కడెం ప్రధాన కాలువలలో పూడికతీత ఉపాధి హామీ పనులకు వెళ్లి టాటాఏస్ వాహనంలో తిరిగి వస్తుండగా టాటాఏస్ వాహనం ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న 28వ డిస్ట్రిబ్యూటరి నీటి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లవ్వకు కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూమేష్ తెలిపారు.



బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఉపాధి హామీ కూలీ బంగారు మల్లవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గాయపడిన వారికి రూ.ఐదు లక్షలు, మృతి చెందిన మల్లవ్వ కుటుంబానికి రూ.పది లక్షలు చెల్లించాలన్నారు.

ఆత్మహత్య కాదు..హత్య

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్
- సింగరేణి సీఎండీ స్పందించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగి కిరీటిది ఆత్మహత్య కాదని అధికారులు మానసిక ఒత్తిడికి గురి చేసి హత్య చేశారని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం ఎస్టీపీపీ సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిరీటి ఆత్మహత్యకు సింగరేణి యాజమాన్యం బాధ్యతవహించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్‌తో చేసుకున్న ఒప్పందాన్ని యాజమాన్యం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ కాంట్రక్ట్ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. కాగా ఎస్టీపీపీ ఉద్యోగి కిరీటి ఆత్మహత్య పట్ల సింగరేణి సీఎండీ స్పందించడంతో పాటు బాధిత కుటుంబానికి బాసటగా నిలువాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు కిరీటి సర్వీస్‌ను కొనసాగించాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు బాధిత కుటుంబాన్ని పరమార్శించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కిరీటి ఆత్మహత్యకు బాధ్యులైన విజిలెన్స్ అదికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌ను ప్రక్షాలన చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ గడిపెల్లి కృష్ణ ప్రసాద్, ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ నాయకులు విక్రమ్, ప్రదీప్ రెడ్డి, సాయి క్రిష్ణా రెడ్డి, ఎల్క రమేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఇందన్‌పల్లి యూపీఎస్, కొత్తపేట (బి) గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మండలంలోని 38 పాఠశాలల్లో మరమ్మతులు కొనసాగుతున్నాయన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు స్కూలు యూనిఫాం అందిస్తామని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిరా కాంతి పథకం కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాంలో కొడుతున్న కేంద్రాన్ని పరిశీలించారు. యూనిఫామ్, త్వరగా కుట్టించి పాఠశాలలకు అందించాలని నిర్వాహకులను కోరారు.



నివేదికలకే పరిమితమైన సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిషత్ కార్యాలంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ప్రగతి నివేదికలకే పరిమితమైంది. స్థానిక ఎంపీడీఓ రాధిక రాథోడ్, మండల పరిషత్ అధ్యక్షురాలు చెరుకు దీపికా రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మణ్, కాజీపల్లి ఎంపీటీసీ పెద్దల రూప బాపుతో పాటు హాజరు కాగా ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్, ఐసీడీఎస్ తదితర శాఖలకు సంబంధించిన ప్రగతిని చదివి వినిపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మాణాలకు అవకాశం లేకపోగా ప్రభుత్వ శాఖలకు సంబంధించి కొనసాగుతున్న పనుల వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సదానందంతో పాటు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి

నవతెలంగాణ-వేమనపల్లి



ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని కల్మలపేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే నెన్నెల గ్రామానికి చెందిన కొమురే అంజన్న, నాగమణిల కూతురు కొమురే సాయి పల్లవి(11) వేసవి సెలవులలో భాగంగా కల్మలపేట గ్రామంలోని అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చింది. రాత్రి సాయి పల్లవికి ఛాతిలో నొప్పి రావడంతో నీల్వాయిలోని ఆర్‌ఎంపీ వైద్యుడు టంకసాల సంతోష్ కుమార్ వద్దకు తీసుకువెళ్లారు. ఆయన ఇంజక్షన్ ఇచ్చారు. దాంతో బాలికకు పల్స్ రేటు పడిపోయి, బీపీ తగ్గిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 5 గంటలకు మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం వల్లనే బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు.

గూడెం గోదావరి నదిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి



నవతెలంగాణ-దండేపల్లి

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపెల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్ గౌడ్(19) ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు గూడెం గోదావరి నదిలో మునిగి మరణించినట్టు ఎస్ఐ భూమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కీర్తన్ గౌడ్ తన స్నేహితులతో కలిసి గూడెం గోదావరి నది తీరాన గల హనుమాన్ ఆలయం వద్దకు హనుమాన్ మాలధారణ కోసం వచ్చాడు. ఇదే క్రమంలో ఉదయం పుణ్య స్నానం ఆచరించేందుకు తన స్నేహితులతో కలిసి గోదావరి నదిలోకి వెళ్ళాడు. కీర్తన గౌడ్‌కు ఈత రాకపోవడంతో అకస్మాత్తుగా నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే నీటిలో మునిగిలో కీర్తన్ మృతి చెందాడు. మృతుని తండ్రి దుర్గం తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

పోచమ్మ చెరువును కబ్జా నుండి కాపాడాలి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో గల పోచమ్మ చెరువును కబ్జాదారుల నుండి కాపాడాలని బీజేపీ నాయకుల తుల మధుసూదన్ అన్నారు. సోమవారం చెరువు ప్రాంతంలో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ పోచమ్మ ఆలయ ఆవరణలో గల చెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. అందుకోసమే చెరువులో కందకాలు, పూడికలు చేస్తున్నారన్నారు. కొన్ని రోజుల క్రితం చెరువు శిఖం భూమిలో వేసిన హద్దులు చెరిపేసి, రాళ్లు తొలగించి చెరువును కబ్జా చేసేందుకు చూశారన్నారు. గత ప్రభుత్వంలో నాయకుల వైఫల్యంతో ఎన్నో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురయ్యాయని, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చూడాలన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించి కబ్జాకు గురైన పోచమ్మ ఆలయం ప్రాంతంలోని చెరువు స్థలంపై విచారణ జరిపి పోచమ్మ చెరువు కబ్జాకు గురి కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమ రాములు, దాస్య నాయక్, వెంకటేశం, చంద్రయ్య, నరసయ్య, సంగం రామచంద్రం పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో పర్యటించిన శిక్షణ అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఐదుగురు సభ్యులతో కూడిన శిక్షణ అధికారుల బృందం పర్యటించింది. గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు పరిశీలించారు. గ్రామ రైతులు, మహిళలతో గ్రామ భౌగోళిక, సామాజిక, ఆర్థిక విషయాలపై గురించి చర్చించి వివరాలు తెలుసుకున్నారు. వీరి శిక్షణ మండలంలో ఈనెల 24వ తేది వరకు కొనసాగుతుంది. బృందంలో సురేంద్ర స్వరూప్(రాజస్థాన్), భిజ్ఞరాజ్ మిశ్రా(ఒడిస్సా), విశాల్ దకడ్(మధ్యప్రదేశ్), నిఖిల్ జూన్(హర్యానా), శివమ్(హర్యానా)తో పాటు ఎంపీఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకటేశ్వరరావు, ఏపీఎం బుచ్చన్న, ఏపీఓ రవీందర్, ఈసీ విలాస్, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

చెత్తకు పెట్టిన మంటతో దగ్ధమైన గడ్డి కుప్పలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



చెత్తకు పెట్టిన మంటతో గడ్డి కుప్పలు దగ్ధమైన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని బోయవాడలో జరిగింది. కంకనాల పోసమ్మ తన పోలంలో సోమవారం చెత్తకు మంట పెట్టడంతో ఆ మంటలు నారాయణ పోలంలో ఉన్న గడ్డి కుప్పలకు అంటుకున్నాయి. దీంతో 600ల గడ్డి కుప్పలు, 2 పెద్ద కవర్లు కాలిపోయాయి. సుమారుగా రూ. 26 వేల వరకు నష్టం జరిగిందని నష్టపోయిన రైతు తెలిపాడు.

ట్రస్మా ఆర్గనైజింగ్ సెక్రెటరిగా రాధాకృష్ణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన చిలుకూరి రాధాకృష్ణ చారిని నియమించి నియామక పత్రాన్ని ట్రస్మా గౌరవ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్ రావ్, అధ్యక్షులు పి.దేవభూషణం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధాకృష్ణ 30 సంవత్సరలుగా ప్రయివేట్ పాఠశాల సమస్యల పరిష్కారనికి కృషి చేశారని, గతంలో ట్రస్మాలో వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించటంతో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పదవీ వరించిందని తెలిపారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతు ట్రస్మా బలోపేతానికి కృషి చేస్తున్నని తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ట్రస్మా రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తునికాకు కూలీకి గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న మదనమ్మ



మదనమ్మను పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజీ పరిధిలోని చారిగాం సమీపంలో తునికాకు సేకరణ కోసం వెళ్లిన మదనమ్మ అనే మహిళా కూలీ ప్రమాదవశాత్తు చెట్టు నుండి జారి కింద పడటంతో తీవ్ర గాయాల పాలైంది. అటవీశాఖ అధికారులు ఆమెను స్థానిక ప్రజా లైఫ్ కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

వైద్య ఖర్చులు అటవీ శాఖ భరించాలి

తునికాకు సేకరణకు వెళ్లి కిందపడి గాయపడ్డ మదనమ్మ వైద్య ఖర్చులు అటవీశాఖ భరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. గాయపడిన ఆమెను ఇంట్లో పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకు సేకరణ సందర్భంగా మదనమ్మ గాయపడడం బాధాకరమని అన్నారు. ఆమె వైద్య ఖర్చులను అటవీ శాఖ అధికారులు భరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వాళ్లకు రూ.8000ల ఖర్చు అయ్యాయని ఆ కుటుంబం తెలిపిందన్నారు. ఆమె గాయం పూర్తిగా మానేంతవరకు మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. పరామర్శించిన వారిలో చరిగాం కల్లెదార్ సత్తయ్య ఉన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రానికి చెందిన కొమ్ము శ్రీనివాస్ శనివారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.. శనివారం ఇంటి నుండి బయటకు వెళ్లిన శ్రీనివాస్ రాత్రి వరకు తిరిగి రాకపోగా గడ్డిమందు తాగి మంచిర్యాల ఆస్పపత్రిలో ఉన్నట్లు తెల్సుకున్న కుటుంబ సభ్యులు వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. రెండు రోజుల పాటు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతుడు భీమారం మండల కేంద్రంలో కిరాణ షాపు నడుతుండగా ఆత్మహత్యకు చేసుకోవడానికి గల కారణాల తెలియరాలేదు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-కౌటాల



ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ సర్పంచ్ కడారి కానుకక్క(65) మృతి చెందిన సంఘటన మండలంలోని శీర్ష గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మాజీ సర్పంచ్ కడారి కానుకక్క కొత్తగా ఏర్పడిన శీర్ష గ్రామ పంచాయతీకి మొదటి సర్పంచిగా గ్రామస్తులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె గడిచిన 5 సంవత్సరాలు గ్రామ ప్రజలకు ఎనలేని సేవలు చేసింది. ఎప్పుడు ఊరి వాళ్ళతో కలిసిమెలిసి ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరిస్తూ అందరూ నా కుటుంబమే అనే భావంతో చూసుకునేది. ఆమె సోమవారం ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా హఠాత్తుగా మరణించడంతో ఊరంతా కంటతడి పెట్టుకున్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ మండలంలోని లాండసాంగి వాగులో సోమవారం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనికి చెందిన అయాన్(15) తన స్నేహితుడితో కలిసి ఇద్దరు లాండసాంగి వాగులో ఈత కొట్టేందుకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. స్నేహితుడు కేకలు వేసినప్పటికీ, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో మృతి చెందాడు. ఈ సమాచారాన్ని అయాన్ తల్లితండ్రులకు ఫోన్ చేసి తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యేను అడ్డుకోవడం సరికాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జైనూర్ మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఘర్షణల్లో గాయపడ్డ బాధితులను సోమవారం పరామర్శించడానికి వెళ్లిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబును పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు నారాయణ, కలికోటరమణయ్య, యెల్లాగౌడ్, నాగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులను పరామర్శించడాన్ని వెళ్లిన ప్రజాప్రతినిధిని అడ్డుకోవడాన్ని తప్పు పట్టారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీసీ సంఘం యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం కాగా విషయం తెలుసుకొని వెంటనే స్పందించి ఆమెకు రక్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు రక్తం అవసరం పడుతుందని అన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అటువంటి వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

నేడు ఇసుక వేలం పాట

నవతెలంగాణ-రెబ్బెన

అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న ఇసుకను మంగళవారం వేలం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ యు.జోష్న తెలిపారు. మార్చి 23న అక్రమంగా రవాణా చేస్తున్న లారీలలో ఉన్న ఇసుకను సీజ్ చేయడం జరిగిందన్నారు. 21 క్యూబిక్ మీటర్ వరకు ఉన్న ఇసుకను మంగళవారం ఉదయం 11 గంటలక రెబ్బెన పోలీసు స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఒకేసారి మొత్తం డబ్బులు డీడీ ద్వారా చెల్లించి ఇసుకను తీసుకెళ్లడానికి అనుమతి ఇస్తామన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-పెద్దపల్లి

2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం పెద్దపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులు జూన్6 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు మొత్తం (5) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మూడో తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదో తరగతిలో గోండు బాలురకు ఒకటి,8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి జూన్ 12న లాటరీ పద్ధతిలో ద్వారా ఎంపిక చేయనున్నట్లు, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9652118867 ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

అక్షరాస్యత నిరంతర కార్యక్రమం



నవతెలంగాణ-నస్పూర్

నిరక్షరాస్యత నిర్మూలన కొరకు ప్రభుత్వం చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని, అక్షరాస్యతా శాతాన్ని పెంపొందించేలా కృషి చేయాలని ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి డా.రవికాంతారావు అన్నారు. జిల్లా వయోజన విద్యా, సఖి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా కన్నెపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రవికాంతారావు మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాలలో అక్షరాస్యత లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, మహిళలు కుట్టు శిక్షణ పొందుతూ వయోజనులకు చదువు నేర్పడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. మహిళలు చదువు నేర్చుకుంటే కుటుంబంతో పాటు సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తాము నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ది పొందాలని తెలిపారు. జిల్లా పాఠశాలల్లో చదువుకుంటున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు కూడా నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడానికి భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, మండల బ్యాంక్ అధికారి గురుస్వామి, సఖి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, డిఆర్‌ఎ.లు, సువర్ణ, ఆర్.ప్రకాశం, సుందిళ్ల రమేష్ పాల్గొన్నారు.

నాసిరకం పనిముట్లతో కార్మికులకు ఇబ్బందులు

నవతెలంగాణ-నస్పూర్

యాజమాన్యం కార్మికులకు నాసిరకం పనిముట్లు అందజేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి, కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గనిలో డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్ కొరత ఉందన్నారు. కాలపరిమితి ముగిసిన ఎస్డీఎల్ యంత్రాలను నడపడం వల్ల ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. ఎస్డీఎల్ యంత్రాలలో ఉపయోగించే ఆయిల్స్ నాసిరకం వాడటం వల్ల అవి చెడిపోతున్నాయన్నారు. నాసిరకమైన పనిముట్ల పంపిణీ గురించి గుర్తింపు సంఘంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. అనంతరం గనిలో ఉన్న సమస్యలపై గని మేనేజర్‌తో చర్చించారు. గని మేనేజర్ సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు గజ్జి రమేష్, ఎం సంపత్, చంద్రమౌళి, కే రాజయ్య, ఎన్ సంపత్, తిరుపతిరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు



నవతెలంగాణ-నేరడిగొండ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని లఖంపూర్ గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళుతున్న కారును లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆదిలాబాద్ ద్వారకనగర్‌కు చెందిన చంద్రశేఖర్ దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

21న జిల్లా ప్రజా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు

నవతెలంగాణ-పెద్దపల్లి

మే 21న జిల్లా ప్రజా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కె.నరేందర్ సోమవారం తెలిపారు. మే 21న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1వ, 2వ, 4వ, 7వ స్థాయి కమిటీ సమావేశం జెడ్పీ చైర్మెన్ పుట్ట మధూకర్ అధ్యక్షతన, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 3వ,5వ,6వ స్థాయికమిటీ సమావేశం సంబంధిత స్థాయి సంఘం అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు, ఈ సమావేశాలకు గౌరవ సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని కోరారు. సమావేశానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని జెడ్పీ సీఈవో కోరారు.

తలమడుగు ఎస్సై ధనశ్రీ బదిలీ

నవతెలంగాణ-తలమడుగు

గత సంవత్సరం తలమడుగు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ధనశ్రీ మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకొంది. మళ్లీ సాదారణ బదిలీల్లో భాగంగా రాజధానికి వెళుతున్న ఎస్సై ధనశ్రీకి పోలీస్ సిబ్బంది సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. తక్కువ కాలంలోనే మండలంలోని అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొంది, బదిలీపై వెళ్తున్న ధనశ్రీకి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సైని సన్మానించిన వారిలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టెట్ ప్రశాంతం

నవ తెలంగాణ-రామగిరి

మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశా లలో టీచర్స్ క్వాలిఫై టెస్ట్ (టెట్) పరీక్ష సోమవారం ప్రశాం తంగా ముగి సింది. రెండు సెషన్లలో 200 మంది విద్యా ర్థుల కుగాను 155 మంది హాజర య్యారు. ఉదయం 100 మందికి 84 మంది, సాయంత్రం 100 మందికి 71 మంది పరీక్ష రాశారని, 45 మంది గైర్హాజరైనట్టు ఛీఫ్ సూపరింటెండ్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-పెద్దపల్లి

ఐకేపీ సెంటర్లోని వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని టీఆర్కేపీఎస్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ఇటీవల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి ధాన్యాన్ని తెలంగాణ రైతు కూలీ పోరాటా సమితి (టీఆర్కేపీఎస్) నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం తడిసిన ప్రతి వడ్ల గింజను కొంటాం అంటుందని, పేరుగొప్ప ఊరుదిబ్బ చందంగా ప్రభుత్వ హామీ ఉన్నదని అన్నారు. అలాగే పలు ఐకేపీ సెంటర్స్‌లో తడిసి మొలకలేసిన వరి కుప్పలను ఏఐఎఫ్‌టీయూ, టీఆర్కేపీఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలీ పోరాటా సమితి (టీఆర్కేపీఎస్) పెద్దపల్లి జిల్లా నాయకులు టీ.రత్నకుమార్ మాట్లాడుతూ..ఆరుగాలం కష్టపడిన రైతుకు అకాల వర్షం తీరని నష్టం చేసిందన్నారు. వాణిజ్య పంటలు, ఆహార పంటలు కూడా వర్షాల వల్ల నష్టపోయాయని, ప్రభుత్వం రైతులకు పంట నష్ట పరిహారం ఊసే తీస్తలేదని అన్నారు. వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని ఏఐఎఫ్‌టీయూ, టీఆర్కేపీఎస్ నాయకులు, జి.రాములు, టీ.రత్నకుమార్, వెల్తురు సదానందంలు సోమవారం పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌కి వినతిపత్రం ఇచ్చారు. అకాల వర్షం వల్ల జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం ప్రకటించాల న్నారు. మొక్కజొన్న, కూరగాయల రైతులకు ఎకరంకు లక్ష రూపాయలు పంట నష్ట పరిహారంగా చెల్లించాలని, ప్రయివేట్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈసెట్ ఫలితాల్లో మెరిసిన రెబ్బెన విద్యార్థి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ విభాగంలో చదువుతున్న ఎంఎ హషీర్ ఉస్మానికి సోమవారం విడుదలైన ఈసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించి, ప్రతిభ కనబర్చారు. విద్యార్థి తండ్రి ఎంఎ షాకిర్ ఉస్మాని తిర్యాణి మండలంలో గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో సహాయ కార్యక్రమాధికారిగా పనిచేస్తున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని రెబ్బెన జెడ్పీటీసీ వేమూర్ల సంతోష్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరి మధునయ్య, రెబ్బెన మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లేవుడ్యా రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, గౌడ సంఘ జిల్లా అధ్యక్షులు మోడం సుదర్శన్‌గౌడ్, రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకిర్ ఉస్మాని, మిట్ట దేవేందర్, గ్రామస్తులు అభినందించారు.

భూముల వేలంతో రూ.1.54లక్షల ఆదాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని కేశవనాథ స్వామి దేవాలయానికి సంబంధించిన భూమి సర్వే నెంబరు 94లోని భూములు మొత్తం విస్తీర్ణము 11.16గుంటలు ఒక సంవత్సరం కాలము సాగు చేసుకొనుటకు కౌలునకు నిర్ణయించిన బహిరంగ వేలంలో రూ.1.54 లక్షల ఆదాయం వచ్చినట్టు దేవాలయ కార్యనిర్వహణ అధికారి బాపిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో ఆయన మాట్లాడుతూ 6 సర్వే నెంబర్లలో భూమి ఉందని, ఒక్క సర్వే నెంబర్ లోని భూమి వేలం వేయడం జరిగిందని తెలిపారు. మిగతా 5 సర్వే నెంబర్లలోని భూములకు సంభందించిన వేలం తేదీలను త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు. గతంతో పోలిస్తే రూ.55వేలు అధికంగా ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ వైరాగరే మనోజ్ కుమార్, దేవాలయ అర్చకులు నరేష్ శర్మ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ మార్కెట్‌లో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ గోడం త్రియంబక్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రయివేట్‌లో అమ్మి మోసపోవద్దని అన్నారు. మార్కెట్‌లో అమ్మి లాభం పొందాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఈఓ మల్లయ్య రైతులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌లో జర్నలిస్ట్ పై దాడి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌కు చెందిన ఆదాబ్ హైదరాబాద్ విలేఖరి అంగల తిరుపతిపై సోమవారం అక్రమ మైనింగ్ నిర్వాహకులు దాడి చేశారు. కాగజ్‌నగర్ మండలం చారిగాం రహదారిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్లలో నింపుతుండగా జర్నలిస్ట్ తిరుపతి ఫోటోలు తీసేందుకు అక్కడికి వెళ్లాడు. అక్కడ ఉన్నవారు తిరుపతిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. బూతులు తిడుతూ దాడి చేశారు. దీనిపై కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు తిరుపతి ఫిర్యాదు చేశాడు. కాగజ్‌నగర్ జర్నలిస్టులు ఆయనకు సంఘీభావం తెలిపి జర్నలిస్ట్‌పై దాడి జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్ట్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం

ఆదాబ్ హైదరాబాద్ జర్నలిస్ట్ అంగల తిరుపతిపై అక్రమ మైనింగ్ నిర్వాహకుల దాడిని కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. పట్టణ సరిహద్దుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా ఏనాడూ పట్టించుకోని అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ఈనాడు అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్నారు. జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో జిల్లా, రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడుతామని తెలిపారు.